


జాతీయ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

## ఐఎల్‌పీఏ జాతీయ సదస్సును విజయవంతం చేయాలి

భువనగిరి అర్బన్, డిసెంబర్ 1 : హైదరాబాద్‌లోని జవహర్ లాల్ నెహ్రూఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఈ నెల 10న జరిగే ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) 3వ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ భువనగిరి బార్ అసోసియేషన్, ఐఎల్‌పీఏ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య మాట్లాడుతూ ఐఎల్‌పీఏ సదస్సులో న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ముఖ్యఅతిథులుగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి, ఓబీసీ జాతీయ కమిషన్ చైర్మన్ ఈశ్వరయ్య, ఐపీఎస్ మోక సత్తిబాబు, కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎస్.బాలకిషన్, తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ కే సునీల్‌గౌడ్, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు జయశంకర్, వెంకట్, కొండారెడ్డి, జితేందర్ రెడ్డి, హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎల్‌పీఏ జిల్లా అధ్యక్షుడు గోదా వెంకటేశ్వర్లు, సిద్ది రాములు, కృష్ణారెడ్డి, శంకర్, రవీందర్‌రెడ్డి, బాబురావు పాల్గొన్నారు.

## పైళ్ల శేఖర్‌రెడ్డి గెలుపు తథ్యం

**బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి**

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 1 : భువనగిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలువడం ఖాయమని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ అభివృద్ధి, సంక్షేమాలకు పట్టం కడుతారని ధీమా వ్యక్తం చేశారు. భువనగిరి నియోజకవర్గం గతానికి భిన్నంగా అభివృద్ధి జరిగిందని, ప్రజందరూ అభివృద్ధి ప్రధాతకు పట్టం కడుతారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని తెలిపారు. ఈనెల 3న వెలువడే ఫలితాల్లో ప్రతిపక్షాలకు డిపాజిట్లు సైతం దక్కవన్నారు.

# ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్మూలిద్దాం

భువనగిరి సిటీ, డిసెంబర్ 1: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం భువనగిరిలోని జిల్లా దవాఖాన నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ పరిపూర్ణచారి ర్యాలీని ప్రారంభించి అనంతరం వెటర్నరీ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ అధికారి వై.పాపారావు, జిల్లా మలేరియా అధికారి వినోద, జిల్లా ఎన్సీడీ అధికారి సుమన్‌కల్యాణ్, డీపీఎంఓ ధరణికుమార్, జ్యోతి, సైదులు వైద్య అధికారి నిరోషా పాల్గొన్నారు.




భువనగిరిలో అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ పరిపూర్ణాచారి

### ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

రామన్నపేట : ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి అశ్విన్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా మునిపంపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం రామన్నపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యులు చందస్వీ, శివసాయి, సూపర్‌వైజర్లు చంద్రకళ, గోపాల్, అండాలు, వాణిశ్రీ, ఎంపీహెచ్‌ఏ మల్లేశం, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.




భువనగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది




రామన్నపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

# సాగర్ డ్యామ్‌పై హైటెన్షన్

## రెండో రోజూ కొనసాగుతున్న ఉద్రిక్తత

- తెలంగాణ వైపు భారీ పోలీసు బలగాల మోహరింపు
- మరోవైపు చర్చలు నిర్వహిస్తున్న ఇరిగేషన్ అధికారులు
- ఆంధ్రా ఇరిగేషన్, పోలీసులపై నందికొండలో కేసులు నమోదు
- నేడు కేంద్రం నుంచి అదనపు బలగాలు

నందికొండ, డిసెంబర్ 1 : నాగార్జున సాగర్ డ్యామ్‌పై గురువారం రాత్రి ప్రారంభమైన ఉద్రిక్తత పరిస్థితులు శుక్రవారం కూడా కొనసాగాయి. ఆంధ్రా అధికారులు సుమారు వెయ్యి మంది పోలీస్ బలగాలతో గురువారం తెల్లవారుజామున డ్యామ్ గేట్లను పాడుచేశారు. డ్యామ్‌పై విధులు నిర్వహిస్తున్న తెలంగాణ ఎస్‌పీఎఫ్ పోలీసులపై దాడి చేసి ఫోన్లు, సీసీ కెమెరాలను ధ్వంసం చేసి డ్యామ్‌పైకి ప్రవేశించారు. డ్యామ్ 13వ గేట్ వరకు తమదని అక్కడ ముళ్ల కంచె, బారికేడ్లు ఏర్పాటు చేసి డ్యామ్ పైన రోడ్డును మూసివేశారు. అవతల ఆంధ్రా పోలీసులు పహారా కాస్తూ డ్యామ్ పైన 13వ గేట్ అవతల ఉన్న కంట్రోల్ రూమ్‌కు తెలంగాణ అధికారులను, పోలీస్ వాళ్లను పోకుండా నిలిపివేశారు. డ్యామ్ సగ భాగం తమదని కుడి కాల్వకు నీటిని విడుదల చేసుకుంటామని, గురువారం బలవంతంగా కుడి కాల్వ గేట్లను తెరిచి 5వేల క్యూసెక్కులతో నీటి విడుదల చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. వాటిని తిప్పికొట్టడానికి తెలంగాణ ప్రభుత్వం భారీగా పోలీస్ బలగాలను తెలంగాణ వైపు ఉన్న డ్యామ్ వద్ద మోహరించింది. సమస్యను పరిష్కరించడానికి ఇరిగేషన్ అధికారులు ఆంధ్ర అధికారులతో చర్చలు నిర్వహిస్తున్నారు.

**బలగాల మోహరింపు**

ఆంధ్ర అధికారులు, పోలీస్ బలగాలు నాగార్జునసాగర్ డ్యామ్‌పైన ఉద్రిక్తత వాతావరణం నెలకొల్పడంతో పరిస్థితులను చక్కదిద్దడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక, సివిల్, ఏఆర్, బెటాలియన్లతో పోలీస్ బలగాలను తెలంగాణ వైపు ఉన్న డ్యామ్ వద్ద మోహరించింది. వెయ్యి మంది పోలీసులు తెలంగాణ వైపు ఉన్న డ్యామ్ వద్ద పహారా కాస్తున్నారు.

### ఇరిగేషన్ అధికారుల చర్చలు

నాగార్జునసాగర్ డ్యామ్‌పైకి అక్రమంగా ప్రవేశించి, కృష్ణా రివర్ బోర్డు ఆదేశాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆంధ్రా అధికారులతో తెలంగాణ ఇరిగేషన్ అధికారులు శుక్రవారం చర్చలు జరిపారు. నాగార్జునసాగర్ డ్యామ్ వద్దకు శుక్రవారం ఉదయం ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ హరిరామ్, సీఈలు హమీద్‌ఖాన్, ధర్మానాయక్, రమేశ్ బాబు చేరుకొని డ్యామ్ పైన పరిస్థితులను పరిశీలించి ఆంధ్రా అధికారులతో చర్చించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో శ్రీశైలం డ్యామ్ నిర్వాహణను ఆంధ్రా ప్రభుత్వం, నాగార్జునసాగర్ డ్యామ్ నిర్వాహణ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని నిర్ణయించినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కృష్ణా రివర్ బోర్డు సూచనల ప్రకారం ఆంధ్రా రాష్ట్రానికి రావలసిన నీటి వాటాను వారికి విడుదల చేస్తున్నామన్నారు. కృష్ణా బోర్డు సూచించిన ప్రకారం 5 టీఎంసీల నీటికి బదులుగా 5.10 టీఎంసీల నీటిని అక్టోబర్‌లో విడుదల చేశామని, 2024 జనవరి నెలలో మరో 5 టీఎంసీల నీటిని విడుదల చేయవలసి ఉన్నదని తెలిపారు. నవంబర్‌లో కుడి కాల్వకు నీటి విడుదలపై ఆంధ్రా అధికారుల నుంచి వినతి లేదని, ఆంధ్రా అధికారులు కావాలనే డ్యామ్‌పై ఉద్రిక్త వాతావరణం నెలకొల్పి కుడి కాల్వకు నీటిని విడుదల చేసుకున్నారని చెప్పారు. నీటి విడుదల, డ్యామ్‌పై ఆంధ్రా అధికారుల తీరును కృష్ణా రివర్ బోర్డుకు తెలియపరిచామన్నారు. కుడి కాల్వ ద్వారా నీటి విడుదలను నిలుపుదల చేయాలని ఆంధ్రా ప్రభుత్వానికి కృష్ణా రివర్ బోర్డు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. అయినా.. ఆంధ్ర ప్రభుత్వం ఆ ఆదేశాలను పట్టించుకోకుండా కుడి కాల్వకు నీటి విడుదలను కొనసాగిస్తున్నది. అయితే.. నాగార్జునసాగర్ డ్యామ్ వద్ద పరిస్థితులను చక్కబెట్టడానికి, ఆంధ్రా అధికారులు, పోలీసులను తిప్పిపంపడానికి కేంద్ర పోలీస్ బలగాలు చేరుకుంటున్నాయి. సుమారు 300 మంది కేంద్ర బలగాలు రానున్నట్లు సమాచారం.



నాగార్జునసాగర్ డ్యామ్ ఆంధ్రా వైపు చేరుకున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

### ఆంధ్రా అధికారులు, పోలీసులపై కేసులు నమోదు

నాగార్జునసాగర్ డ్యామ్‌పై ఉద్రిక్త వాతావరణం నెలకొల్పి డ్యామ్ పోలీస్ సిబ్బందిపై దాడి చేసి, సీసీ కెమెరాలు, ఫోన్లను ధ్వంసం చేసిన ఆంధ్రా అధికారులు, పోలీసులపై తెలంగాణలోని నందికొండ పైలాన్‌కాలనీలోని పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ డ్యామ్ ఇరిగేషన్ అధికారులు కేసులు పెట్టారు.



నాగార్జునసాగర్ డ్యామ్‌పై చర్చలు జరుపుతున్న తెలంగాణ ఇరిగేషన్ అధికారులు



తెలంగాణ వైపు పోలీస్ బలగాల మోహరింపు